క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె రూరల్: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 14న శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పట్టణంలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఆ శాఖ పట్టణ ఏఈ ఏడుకొండలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏకలవ్య విగ్రహం ఏరియా, డొంక రోడ్డు ఏరియా, రాజేష్ థియేటర్ నుంచి ఉప్పూడి రోడ్డు వరకు, రాజశ్రీ వక్కపొడి ఫ్యాక్టరీ వీధి నుంచి కిసాన్ నగర్ రహదారి, రింగు రోడ్డు నుంచి రైల్వేస్టేషన్, బస్టాండ్ నుంచి నిజాంపట్నం రోడ్డు, ఉప్పూడి రోడ్డు, జగనన్న కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, గరువు రోడ్డులో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి, సహకరించాలని తెలిపారు.

నేడు భట్టిప్రోలులో..

భట్టిప్రోలు: భట్టిప్రోలు, పెదపులివర్రు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఇన్‌చార్జ్ ఏఈ ఏడుకొండలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

చుండూరులో ప్రకృతి వనరుల కేంద్రం ప్రారంభం



చుండూరు(భట్టిప్రోలు): చుండూరు రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వనరుల కేంద్రాన్ని ఎంపీపీ జాలాది రూబెన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన అన్ని కషాయాలు, గ్రోత్ ప్రమోటర్స్, ఎస్-2 ఎస్ కిట్స్, ద్రవ, జీవామృతాలు అందుబాటులో ఉన్నాయని ఐసీఆర్పీ ఎ.పార్వతీ తెలిపారు. రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలను పాటించి, అధిక దిగుబడులను సాధించాలని ఎంపీపీ రూబెన్ ఆశాభావం వ్యక్తం చేశారు. వీటి ధరలు కూడా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. సచివాలయ, వ్యవసాయ, మండల సమాఖ్య ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు సత్యసాయి ట్రస్ట్ వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం

పిట్టలవానిపాలెం: ఖాజీపాలెం గ్రామంలో శ్రీ సత్యసాయి సృజల స్రవంతి ట్రస్టు ఆధ్వర్యంలో సాయి స్వస్థ్య వెల్‌నెస్ కేంద్రాన్ని శనివారం ఉదయం 9.45 గంటలకు ప్రారంభించనున్నట్లు ట్రస్టు ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్లినిక్‌లో చిన్న పిల్లల వైద్య పరీక్షల, గుండె సంబంధిత వ్యాధులకు వైద్య చికిత్సలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. బాపట్ల శాసన సభ్యులు కోన రఘుపతి, కలెక్టర్ రంజిత్ బాషా ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ట్రస్టు నిర్వాహకులు సద్గురు శ్రీ మధుసూదన సాయి పాల్గొంటారని తెలిపారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ రక్షణ

బాపట్ల: మొక్కలు పెంచటం వల్ల పర్యావరణాన్ని కాపాడవచ్చని సహదయ ఫౌండేషన్ సభ్యుడు జి.వి.భట్టు అన్నారు. అప్పికట్ల గ్రామంలోని విశ్వనాథస్వామి, వెంకటేశ్వర స్వామి దేవాలయంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పి. శ్రీకాంత్, కల్యాణి, జి.శ్రీరామ్మూర్తి, సాయిస్వామి, ఆలయ అర్చక స్వామి డాక్టర్ శశిధర్ పాల్గొన్నారు.

వరిలో ఆకు ముడత తెగులు జాడ

చెరుకుపల్లి: రైతులు ఆకు ముడత తెగులును వెంటనే నివారించుకోవాలని, లేని పక్షంలో దిగుబడి తగ్గే అవకాశం ఉందని బాపట్ల జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం వ్యవసాయాధికారి ఆర్.విజయ్‌కుమార్ అన్నారు. స్థానిక వ్యవసాయాధికారి బాలాజీ గంగాధర్‌తో కలసి శుక్రవారం పొన్నపల్లిలో వరి పొలాలను ఆయన పరిశీలించారు. పైరులో ఆకు ముడతను గుర్తించటం జరిగిందని, దీనిని నాము లేదా తెల్ల తెగులు అని పిలుస్తారని ఆయన తెలిపారు. గొంగళి పురుగు ఆకు ముడతలో ఉండి పత్ర హరితాన్ని గోకి తినటం వల్ల ఆకు తెల్లబడి పోతుందన్నారు. నివారణ మార్గాలను సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి దాసరి మాధవి, వ్యవసాయసహాయకులు,రైతులుపాల్గొన్నారు.

ఫెన్సింగ్ జిల్లా జట్టుకు హైవెండ్ విద్యార్థుల ఎంపిక



కర్లపాలెం: ఫెన్సింగ్ జిల్లా జట్టుకు తమ పాఠశాల విద్యార్థులు పి.ఇంద్రసేనారెడ్డి, ఎస్. శివసాయిరెడ్డి ఎంపికయ్యారని కర్లపాలెం హైవెండ్ హై స్కూల్ హెచ్ఎం ఎస్.లక్ష్మి తెలిపారు. శుక్రవారం ఫెన్సింగ్ క్రీడాకారులకు పాఠశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 12న జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి గుంటూరులో జిల్లా జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్‌చైర్మన్ ఉదయ్ చంద్రరావు, మేనేజింగ్ డైరెక్టర్ సాయి మహేంద్ర, పాఠశాల డైరెక్టర్ చాందినీ, పీడీ గోపీచంద్ పాల్గొన్నారు.

అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే కోన రఘుపతి

కర్లపాలెం: ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని, అందుకే ప్రతి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. మండల పరిధిలోని యాజలి గ్రామంలో శుక్రవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను సందర్శించి, ఆహార పదార్థాలను రుచి చూశారు. సీఎం వైఎస్ జగన్ 99 శాతం హామీలను నెరవేర్చారని కోన తెలిపారు. ప్రజలందరూ సీఎం జగన్ ప్రభుత్వానికి అండగా నిలిస్తే మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాదెండ్ల భానుప్రసాద్, ఎంపీటీసీ నవనీతం, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, నాయకులు పరమానందకుమార్, అట్ల నాగేశ్వరరెడ్డి, సమ్మెట వెంకటేశ్వరరెడ్డి, ఇక్కుర్తి శ్రీనివాసరావు, పీవీ సురేష్, మల్లెల ఆదాం, తహసీల్దారు కేశవనారాయణరావు, ఈఓపీఆర్డీ ఎలీషాబాబు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం

పిట్టలవానిపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నట్లు బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. పోతనకట్టవారిపాలెంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఎమ్మెల్యే కోన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ ఎనుముల శివపార్వతీ అధ్యక్షతన జరిగిన సభలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామ సచివాలయాలలో విజయవంతంగా నిర్వహించిన అధికారులకు, అందుకు సహకరించిన నాయకులను, వైద్య సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఆర్థోపెడిక్ పెడిక్ సర్జన్ డాక్టర్ రాజేశ్వరి, జనరల్ ఫిజీషియన్‌లు డాక్టర్ లీలా బ్రాంత్ కర్మల్, డాక్టర్ సుహానా బేగం, ఎంఎస్ జనరల్ సర్జన్ డాక్టర్ కిన్నెర, ఎంఎస్ ఆప్తమాలజిస్ట్ డాక్టర్ మాణిక్యమ్మ 280 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. వైస్ ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు, చేబ్రోలు కృపానందం, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షులు ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా మహిళా అధ్యక్షురాలు యేట్ర అశ్వినిరెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



పీవీపాలెం తహసీల్దారు కవితను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

నాయకులు, అధికారులకు సన్మానం..

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మండలంలో విజయవంతంగా ముగిసిన సందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతిని పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. మండలాధ్యక్షుడిగా ఎన్నికైన లీలా శ్రీనివాసరెడ్డిని, కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన అధికారులను ఎమ్మెల్యే సత్కరించారు.

చినపరిమిలో 820 మందికి వైద్య పరీక్షలు

చుండూరు(భట్టిప్రోలు): చుండూరు మండలం చిన పరిమిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. 820 మందికి వైద్యులు వైద్య పరీక్షలు జరిపారు. గ్రామ సర్పంచ్ మేరుగ సుభాషిణి, ఎంపీపీ జాలాది రూబెన్, ఎంపీటీసీ సభ్యులు అవుతు శివపార్వతీ, ఎంపీడీవో పి.సుగుణమ్మ, మండల ప్రత్యేక అధికారి పి.జెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

350 మందికి వైద్య పరీక్షలు

రేపల్లె రూరల్: మండలంలోని అరవపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో విశ్వేశ్వరం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది 350 మందికి వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఎంపీడీవో శివపార్వతీ, ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు, సర్పంచ్ లోయా బాబూనాంచారయ్య, ఎంపీటీసీ అల్లంశెట్టి సతీష్ పాల్గొన్నారు.



బలుసుపాలెంలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు వెంకటేశ్వర్లు

అనారోగ్య సమస్యలకు పరిష్కారం..

చెరుకుపల్లి: పేదల కోసమే నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య వైద్య శిబిరాలను గ్రామంలో ప్రతి ఒక్కరూ వినియోగించుకుని అనారోగ్య సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దారు కె.వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని బలుసులపాలెం సచివాలయ పరిధిలో ఎంపీయూపీ పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 434 మందికి వైద్యులు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో టి.నవీన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి షాహీనా బేగం, కావూరు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఎస్.రవి ప్రకాష్, డాక్టర్ సాలేహాజుబేర్, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కిట్లు పంపిణీ..

బాపట్ల: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. శుక్రవారం బాపట్ల మండలంలోని పూండ్ల గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ పేదలు విద్య, వైద్యం కోసం ఎక్కువ ఖర్చు పెడుతుంటారని పేర్కొన్నారు. వారికి వైద్య సేవలు ఉచితంగా అందించటంతో అప్పులు బాధ నుంచి తప్పించేందుకు అవకాశం ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎంతో ఉపయోగకరంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, కాగిత సుధీర్‌బాబు, గంగిశెట్టి రత్తయ్య, సుమన్‌రెడ్డి పాల్గొన్నారు.



కొల్లూరు వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న గ్రామస్తుల

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

కొల్లూరు : ప్రజా ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేయడం ద్వారా మెరుగైన వైద్య సేవలను గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిందని వేమూరు మార్కెట్ యార్డు చైర్ పర్సన్ ఉప్పు శిరీష అన్నారు. శుక్రవారం కొల్లూరు సచివాలయం -3 పరిధిలో స్థానిక ఎస్సీ కాలనీలోని బీఎస్ఎఫ్ పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆమె పాల్గొన్నారు. వైద్య శిబిరంలో పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 608 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. దృష్టి లోపంతో ఇబ్బంది పడుతున్నవారికి కళ్లజోళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు బుల్లా నవరత్నం, బావిరెడ్డి వెంకట్రామయ్య, వార్డు సభ్యురాలు అత్తోట రత్నకుమారి, ఈపూరు సొసైటీ బ్యాంక్ చైర్మన్ సూర్యదేవర రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ అయిల సుబ్బారావు, ఎంపీడీఓ ఐ. సత్యనారాయణరావు, పంచాయతీ ఈఓ బి. మల్లికార్జున, ఎంఈఓ-2 టీవీఎస్. జ్యోతి, వైద్యులు పావని, మౌనిక, వి.కావ్యతేజ, బి.రాజ్‌కుమార్, ఎన్. సుష్మ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక అభ్యున్నతికి పెద్దపీట

ఎమ్మెల్యే కోన రఘుపతి

కర్లపాలెం: మహిళల ఆర్థిక అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ పెద్ద పీట వేశారని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. కర్లపాలెం ఆర్యవైశ్య కల్యాణ మండపం ఆవరణలో శుక్రవారం జగనన్న వరాల జల్లు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కోన రఘుపతి ముఖ్య అతిథిగా విచ్చేసి డ్వాక్రా సంఘాల మహిళలకు బ్యాంకు నగదు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మలందరూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి మహిళల కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. డ్వాక్రా మహిళలు చిరు వ్యాపారాలతో పాటు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. 2019 ఏప్రిల్ నాటికి మహిళలకు ఉన్న బ్యాంకు రుణాల మొత్తం సొమ్మును రుణమాఫీ పథకం ద్వారా నాలుగు విడతలుగా అక్కచెల్లెమ్మల పొదుపు ఖాతాకు జమ చేస్తున్నామని చెప్పారు. ఈ పథకంలో ఇప్పటి వరకు కర్లపాలెం మండలానికి రూ.39 కోట్లు మహిళల బ్యాంకు ఖాతాలకు జమ చేయటం జరిగిందని ఎమ్మెల్యే కోన రఘుపతి వెల్లడించారు. కర్లపాలెంలో అంబేడ్కర్ సామాజిక భవన నిర్మాణానికి 15 సెంట్లు, స్త్రీ శక్తి భవన నిర్మాణానికి 15 సెంట్లు, వైఎస్సార్ సామాజిక భవనం కోసం స్థలం కేటాయిస్తున్నామని చెప్పారు. ఏపీఎం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జగనన్న వరాల జల్లు కార్యక్రమంలో భాగంగా 83 సమైఖ్య సంఘాలకు రూ.13.81కోట్ల రుణాలు ఇచ్చామని తెలిపారు. స్త్రీ నిధి రుణాలు రూ.1.66 కోట్లు, సామాజిక పెట్టుబడి నిధి నుంచి 12 సమైఖ్య సంఘాలకు రూ.14.50లక్షల రుణాలకు సంబంధించి నగదు చెక్కులను ఎమ్మెల్యే కోన రఘుపతి అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నక్కా లలితకుమారి, ఎంపీటీసీలు ఎస్కే ఆసిఫ్ అలీ, తాండ్ర సాంబశివరావు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు పందరబోయిన సుబ్బారావు, కాగిత బుల్లియ్య, సర్పంచ్‌లు దేవరకొండ అంకమ్మ, మల్లెల వెంకటేశ్వర్లు, అక్కల శ్రీనివాసరెడ్డి, మండల సమైఖ్య అధ్యక్షురాలు సీహెచ్ ధనలక్ష్మి, వివిధ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్లు శైలేష్ భగత్, మురళీకృష్ణ, కె.రత్నజ్యోతి పాల్గొన్నారు.



డ్వాక్రా మహిళలకు మోడల్ నగదు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్స్ పంపిణీ

భట్టిప్రోలు: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారులకు సేవలు అందించడమే కాక సామాజిక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని కేఎస్‌కే జూనియర్ బాలికల కళాశాల ప్రిన్సిపల్ పి. స్వర్ణలత అన్నారు. స్టేట్ బ్యాంక్ తెనాలి ఎస్ఎల్ఎంకేపీ ప్రసాదరావు, ఏజీఎం(ఆర్‌బీవో) ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక కళాశాలలో ఇంటర్, డిగ్రీ విద్యార్థులు 300 మందికి శానిటరీ ప్యాడ్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ కె.లింగారెడ్డి, బ్యాంక్ సిబ్బంది పి.అనూష (పీఓ), క్లర్క్ హరిత, మెసెంజర్ రాధిక, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎం.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ స్వర్ణలత, పక్కన బీఎం లింగారెడ్డి

పర్యావరణాన్ని కాపాడాలి

చెరుకుపల్లి: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని పెంచటం అలవర్చుకుని పర్యావరణాన్ని కాపాడేందుకు కృషి చేయాలని మండల విద్యాశాఖ అధికారి టి.నవీన్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని గూడవల్లి వనజా చంద్రా పబ్లిక్ పాఠశాలలో నాయుడమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వనజా చంద్రా పాఠశాల, సీడ్ బార్డ్ సంస్థ సహకారంతో శుక్రవారం ఇంటికి ఒక మొక్క పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు తమకిచ్చిన మొక్కలను ఇళ్ల ఆవరణలో నాటి అది పెరిగే వరకు సంరక్షించాలన్నారు. గ్రామంలో మొక్కలు పెంచేందుకు శ్రీకారం చుట్టిన పాఠశాల యాజమాన్యాన్ని నవీన్ కుమార్ అభినందించారు. గూడవల్లి గ్రామస్తులకు 2 వేల మొక్కలు పంపిణీ చేయటం జరిగిందని సీడ్ బార్డ్ సంస్థ డైరెక్టర్ కొడాలి జోత్స్న తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ గోగినేని శ్వేత పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్లు దసరా సెలవులు పాటించాలి

రేపల్లె: ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో దసరా సెలవులను అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఎం.సూర్య ప్రకాశ్ అన్నారు. దసరా సెలవులు అమలు చేయాలని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో మండల వనరుల విద్యా కేంద్రంలో శుక్రవారం ఎంఈవో సురేష్‌కు వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. అక్టోబర్ 15 నుంచి 25 తేదీ వరకు దసరా సెలవులను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అయినప్పటికీ ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా పట్టణంలో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు యథావిధిగా తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారని చెప్పారు. ఈ విషయంపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించి నిబంధనల ప్రకారం అన్ని పాఠశాలలో సెలవులు అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్

రేపల్లె: డ్వాక్రా మహిళలను మోసగించిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఐద్వా ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంత మంది అమాయకపు డ్వాక్రా మహిళల సర్టిఫికెట్‌లతో వారికి తెలియకుండా బ్యాంక్ అధికారులను లాలూచీకి గురిచేసి కోట్ల రూపాయల రుణాలు పొందిన ఆర్పీలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రెండు నెలలుగా పోరాటాలు చేస్తున్నా ఫలితం లేకపోయిందన్నారు. ఉన్నతాధికారులు ఈ అంశంపై విచారణకు వచ్చినప్పటికీ, అవినీతికి పాల్పడినవారిపై చర్యలు తీసుకోకపోవటం విచారకరమన్నారు. మహిళలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటాలు చేస్తూనే ఉంటామన్నారు. సోమవారం మెప్మా కార్యాలయం ఎదుట నిర్వహించే నిరసన కార్యక్రమంలో మోసపోయిన డ్వాక్రా మహిళలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా పట్టణ కార్యదర్శి షేక్. ఆశ, ఉపాధ్యక్షులు కె.నాంచారమ్మ, కోశాధికారి షబానా సుల్తానా, సీపీఎం నాయకులు కేవీ లక్ష్మణరావు, కె.ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

అమర జవాన్‌లను గౌరవించుకోవాలి



భట్టిప్రోలు: అమర జవాన్లు, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన పౌరులను గౌరవించుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి అన్నారు. భట్టిప్రోలు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు నా మట్టి-నా దేశం మట్టికి ప్రణామాలు-వీరులకు వందనాలు కార్యక్రమంలో భాగంగా మండలస్థాయి అమృత్ కలశ యాత్ర నిర్వహించారు. ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 15 గ్రామ పంచాయతీల నుంచి సేకరించిన మట్టి, ధాన్యాన్ని మండల కేంద్రంలో ఒకటిగా చేసి మూడు కలశాలలో నింపారు. వీటిని ముగ్గురు ప్రతినిధుల ద్వారా ఢిల్లీకి పంపడం జరుగుతుందన్నారు. వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ టి. ఊహరాణి, ఎంపీటీసీలు మురుగుడు శ్రీనివాసరావు, రావు రాజేశ్వరి, నన్నెపాముల చంటి, కో-ఆప్షన్ సభ్యుడు షేక్ సలీమ్ పాల్గొన్నారు.

రేపట్నుంచి దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం

బాపట్ల అర్బన్: గంగా పార్వతీ సమేత సోమేశ్వరస్వామి దేవస్థానం మండపంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు శ్రీ శ్రీ భావపురి బ్రాహ్మణ సమైక్యత ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు నిభాన పూడి శ్రీహరి ప్రకాష్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని చెప్పారు. ప్రతిరోజు ఉదయం సహస్ర నామార్చనలు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. అనంతరం శరన్నవరాత్రి మహోత్సవాల కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి సోమరాజు శ్రీనివాసు, ఉపాధ్యక్షులు కొలను మోహన్ శ్రీనివాసు, కోశాధికారి శ్రీకాంత్, పి.రామారావు, ఎ.నాగరాజు, జి.వెంకటేశ్వరరావు, శ్రీరామచంద్రమూర్తి, అబ్బరాజు పద్మవల్లి, సభ్యులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రకాష్, సోమరాజు శ్రీనివాసు, కె.మోహన్ శ్రీనివాస్

పెదపులివర్రులో..

పెదపులివర్రు(భట్టిప్రోలు): పెదపులివర్రు గ్రామంలో ఆదివారం నుంచి స్థానికంగా కొలువైన వరదరాజ స్వామి, రాజరాజ నరేంద్రస్వామి, గ్రామ దేవత గోగులమ్మ దేవాలయాలలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. పేరిందేవి, బాలాత్రిపుర సుందరి అమ్మవార్లకు, గోగులమ్మ తల్లికి ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించనున్నట్లు అర్చకులు చెప్పారు.

వెల్లటూరులో..

ముత్యాలమ్మ, కట్లమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం నుంచి 9 రోజుల పాటు అమ్మవార్లకు విశేష అలంకరణలతో పూజలు నిర్వహించనున్నట్లు కట్లమ్మ తల్లి ఆలయ అభివృద్ధి కమిటీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రతి రోజూ ఉదయం అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర శతనామావళి, సాయంత్రం సహస్ర నామావళి పూజలు జరుగుతాయని దేవాలయ అర్చకులు క్రోవి రామకృష్ణ, నిర్వాహకులు పేర్కొన్నారు. అలాగే వెల్లటూరు లాక్ సెంటర్‌లో కొలువైన శ్రీ కనకదుర్గా మహంకాళి నాగేంద్రస్వామి దేవాలయంలో 24వ తేదీ వరకు దసరా మహోత్సవాలు నిర్వహించనున్నట్లు జొన్నా సుబ్బారావు భవాని తెలిపారు. ప్రతి రోజూ అమ్మవారికి ఉదయం అభిషేకములు, కుంకుమార్చన, సాయంత్రం భజనలు జరుగుతాయని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు చింకపాలెం విద్యార్థులు

నిజాంపట్నం: జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనపరచడం హర్షణీయమని ప్రధానోపాధ్యాయురాలు గీతావాణి అన్నారు. చింకపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు జిల్లా తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనపరిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు గీతావాణి మాట్లాడుతూ ఈ నెల 12న గుంటూరు బీఆర్ స్టేడియంలో జరిగిన తైక్వాండో పోటీల్లో విద్యార్థులు ఎస్కె బాజీ, బి.లావణ్య, బి.సోహజాహా బేగ్ పాల్గొని, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. త్వరలో కడప జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. శిక్షణనిచ్చిన పీడీ బుజ్జిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బి.రత్తయ్య, ఎస్ఎంసీ చైర్మన్ లక్ష్మీరాజ్యం, ఉపాధ్యాయులు యాఖుబ్, నాగిడి వెంకటేశ్వరరావు, పుల్లారావు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం గీతావాణి

జిల్లా కేంద్రానికి చేరిన కలశాలు

బాపట్ల అర్బన్: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా మట్టి - నా దేశం జిల్లా స్థాయి కార్యక్రమం బాపట్ల పురపాలక సంఘం ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి సేకరించిన కలశాలలను జిల్లా కేంద్రానికి చేర్చారు. ఈ కార్యక్రమం బాపట్ల జిల్లా విద్యాశాఖ అధికారి పీవీజే రామారావు ఆధ్వర్యంలో ఏఎంఓ బిల్లా మోజేష్ నిర్వహించారు. పురపాలక సంఘం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, జిల్లా సైన్స్ అధికారి ఎండీ సాధిక్ పాల్గొన్నారు.

సేంద్రియ ఉత్పత్తులతో ఆరోగ్యం

రేపల్లె రూరల్: సేంద్రియ ఉత్పత్తులతో ప్రతి ఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ప్రకృతి వ్యవసాయశాఖ అధికారి, రిసోర్స్ పర్సన్ వినయ్‌కుమార్ అన్నారు. ప్రకృతి వ్యవసాయంతో కలిగే లాభాలపై పట్టణంలోని మండల సమాఖ్య కార్యాలయంలో డ్వాక్రా యానిమేటర్‌లకు శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. పురుగు మందులు, ఎరువుల పంట ఉత్పత్తులతో బీపీ, షుగర్ వంటి అనేక రకాల అనారోగ్యాలకు గురవుతున్నట్లు చెప్పారు. అంతేకాకుండా పంట భూమి కూడా సారవంతం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఇంటి పెరటిలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబించి, కూరగాయలు వంటివి పండించుకోవచ్చన్నారు. డ్వాక్రా మహిళలు ఈ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు తెలుసుకుని, రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం త్యాగరాజు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వెంకటేశ్వర్లు(ఐసీఆర్పీ), విజయలక్ష్మి, రమేష్, సీసీలు పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేకుండా చర్యలు

భట్టిప్రోలు: ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకున్నట్లు మండల వ్యవసాయాధికారి జి.మీరయ్య అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీరయ్య మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌కు గాను ఈ-క్రాప్ బుకింగ్ 95 శాతం జరిగిందని చెప్పారు. ఈ నెల 15 నుంచి కొత్తగా ఆర్బీకేలలో నమోదు చేసుకునే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ 16 నుంచి 20వ తేదీ లోగా ప్రతి ఆర్బీకేలో ఈ-క్రాప్ నమోదు జాబితాను ప్రదర్శించాలని, గ్రామ సభ నిర్వహించి అర్జీలు తీసుకుని సవరణలు చేయాల్సిందిగా వీఏఏలు, వీహెచ్ఏలను ఆదేశించారు. రైతులు ఈ క్రాప్ నమోదు చేసుకోని వారు ఉంటే తమ పరిధిలోని ఆర్బీకేలకు వెళ్లి చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సలహా మండలి చైర్మన్ కుందేటి రమేష్, ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి, జెడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి, వైస్ ఎంపీపీ కె. పిచ్చయ్యశాస్త్రి, సలహా మండలి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.